సాక్షి సిద్దిపేట

మహిళా దినోత్సవం

శనివారం । 8 । మార్చి । 2025





పరిశీలించి.. ప్రాధాన్యత గుర్తించి

'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా వల్లూరు క్రాంతి

- మహిళల్లో స్ఫూర్తి నింపే మరిన్ని కథనాలు రావాలని ఆకాంక్ష



పేజీని పరిశీలిస్తూ..



వార్తలు చదువుతూ..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లా వ్యాప్తంగా వచ్చిన వార్తలను పరిశీలించి.. వాటిని క్షుణ్ణంగా చదివి.. ఆ వార్తల ప్రాధాన్యత క్రమాన్ని ఎంపిక చేశారు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి. పాలన పరమైన విధుల్లో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలోని సంగారెడ్డి జిల్లా ఎడిషన్‌కు గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న, ప్రతిభ చూపుతున్న మహిళలకు సంబంధించి విలేకరులు రాసిన ప్రత్యేక కథనాలు ఆమె చదివారు. వాటి ప్రాధాన్యతను కూడా గుర్తించి సబ్ ఎడిటర్‌లతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా పేజీల డిజైన్‌లను పరిశీలించారు. అలాగే వివిధ మండలాలు, పట్టణాల నుంచి వచ్చిన వార్తలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ఈ కథనాలు మహిళలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని కితాబిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లేలా వారిని ప్రోత్సహిస్తూ.. స్ఫూర్తిదాయక కథనాలు మరిన్ని రావాలని ఆకాక్షించారు. దినపత్రికకు గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించడం తనకు ఎంతో మంచి అనుభూతిని ఇచ్చిందన్నారు. పత్రిక నిత్యం ప్రజాసమస్యలను వెలికి తీస్తుండటంతో.. ఆ సమస్యలు అధికార యంత్రాంగం దృష్టికి వస్తాయని.. తద్వారా అధికార యంత్రాంగం వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు. అధికారుల దినచర్య న్యూస్‌పేపర్లతోనే ప్రారంభమవుతందని చెప్పారు. పత్రిక పాఠకునికి చేరడం వెనుక ఆయా విభాగాలు ఎలా పనిచేస్తాయో తెలిసిందని అన్నారు.

న్యూస్‌రీల్

ఆ ఇంటా నలుగురు అమ్మాయిలూ డాక్టర్లే



తల్లిదండ్రులతో ఎంబీబీఎస్ అమ్మాయిలు(ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈ రోజుల్లో ఒక అమ్మాయిని పెంచడమే భారంగా భావిస్తున్న తరుణంలో నలుగురు అమ్మాయిలను పెంచి ఎంబీబీఎస్ చదివించడం అంటే ఆశ్చర్యం కలుగక మానదు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నర్సాపూర్ కాలనీకి చెందిన కొంక రామచంద్రం, శారద దంపతులు దర్జీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మమత, మాధురి, రోహిణి, రోషిణి నలుగురు సంతానం. ఈ దంపతులు అధైర్యపడకుండా పిల్లలని కష్టపడి చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం నలుగురూ ఎంబీబీఎస్ చదువుతున్నారు. తమ పిల్లలు పెద్ద అయ్యి, ఎంబీబీఎస్ సీట్లు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు ఆ దంపతులు.

గ్రామీణ 'నారీ'మణులు

'అహిల్య నారీశక్తి అవార్డు'కు యువతులు ఎంపిక



తలారి స్వాతి



ధనావత్ స్వరూప

చిన్నశంకరంపేట(మెదక్): విద్య, వైద్యం పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామీణ ప్రాంతంలో సేవలు అందిస్తున్న చిన్నశంకరంపేట మండలంలోని ఇద్దరు యువతులు అహిల్య నారీ శక్తి అవార్డుకు ఎంపికయ్యారు. ఖాజాపూర్ తండాకు చెందిన ధనావత్ స్వరూప, చందాపూర్ గ్రామానికి చెందిన తలారి స్వాతి అహిల్య నారీ శక్తిగా గుర్తించి అవార్డును అందిస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన అహిల్య ఉమెన్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పూనమ్ నోముల్వార్ తెలిపారు. మహిళ దినోత్సవం రోజున నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ..తాను తల్లితండ్రులు లేని లోటును బాల్యం నుంచే అనుభవిస్తున్నాను. అందుకే గ్రామీణ చిన్నారులకు, నిరుపేదలకు విద్య, వైద్యం కోసం తనకు తోచిన తీరులో సేవ చేస్తున్నా. చందాపూర్ గ్రామానికి చెందిన స్వాతి మాట్లాడుతూ.. ఎంబీఏ చదువుతూనే సెలవు రోజుల్లో గ్రామీణ విద్యార్థులకు సాయం చేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సానీక్ష ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నందునకుగాను వీరు అవార్డుకు ఎంపికైనట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శివ పేర్కొన్నారు.

అతివ.. అన్నింటా తెగువ

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు
- ఆత్మ విశ్వాసంతో అడుగులు మొదలై.. సాధికారిత వైపు సాగిపోయి
- సేవా కార్యక్రమాల్లోనూ తమదైన గుర్తింపు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రంగాల్లో మెరుస్తున్న మహిళలు

ఆమె ఒక తల్లి, కూతురు, సోదరి, భార్య.. వీటన్నింటికి మించి ఓ పోరాట యోధురాలు. శక్తి యుక్తులు కలిగిన పోరాట నారీమణి. ఇప్పుడు ఆమె ఆకాశంలో సగం కాదు.. అన్నింటా ఆమె. అదే ఇప్పుడు ఆమె లక్ష్యం. నేటి సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. గతంలో వంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్నింట్లోనూ ఆదర్శంగా ముందుకు సాగుతున్నారు. నేటి ఆమె అడుగు మోపని రంగం లేదు.. చేయని పని లేదు.. సాధికారితే లక్ష్యంగా సాగుతూ.. చదువులోనూ, సేవా కార్యక్రమాల్లోనూ, ఉపాధి రంగంలోనూ, రాజకీయాల్లోనూ పెను మార్పులు తెస్తోంది. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు రంగాల్లోనూ, చదువుల్లోనూ రాణిస్తున్న మహిళలు, విద్యార్థినులపై సాక్షి ప్రత్యేకం కథనం..

ఆమెకు ఆపదొస్తే..

మహిళలకు ఆపదొస్తే తక్షణం ఏం చేయాలి..? తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి..? ఇదిగో ఈ నెంబర్లకు సంప్రదిస్తే చాలు కొండంత అండ దొరుకుతుంది. అధికార యంత్రాంగం మీకు రక్షణ కవచంలా ఉంటుంది. మొదట డయల్ 100కు ఫోన్ చేయండి. తర్వాత షీటీమ్, భరోసా కేంద్రాలు, స్థానిక పోలీసులకు సంప్రదించాలి.

సంగారెడ్డి జిల్లా
షీ టీమ్: 87126 56772
సఖీ సెంటర్: 084552 77066

మెదక్ జిల్లా
షీ టీమ్: 63039 23823
భరోసా కేంద్రం: 87126 57964

సిద్దిపేట జిల్లా
షీ టీమ్: 87126 67434
భరోసా సెంటర్: 94403 11933
స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్: 94946 39498

కోటి కాంతుల కనకతార



మహిళలకు కుట్టు పని సూచనలు చేస్తున్న కనకతార

హుస్నాబాద్‌రూరల్: అమ్మ చూపిన కిరాణా షాపు ఆలోచన ఆమె బతుకుకు బాటలు వేసింది. బడిలో నేర్చుకున్న కుట్టు పని వ్యాపారంలో అగ్రస్థానంలో నిలబెట్టింది. ఒకప్పుడు కూటి కోసం తిప్పలు పడిన మహిళ.. ప్రస్తుతం ఏడాదికి రూ.కోటి వరకు వ్యాపారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. మూడు పరిశ్రమలు ఏర్పాటు చేసి 60 మంది స్వశక్తి మహిళలకు ఉపాధి కల్పిస్తుంది. 2024 అక్టోబర్ 17న ఢిల్లీ వేదికగా కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన జాతీయ వ్యాపార సెమినార్‌కు రాష్ట్రం నుంచి ప్రతినిధిగా హాజరై ప్రసంగించింది. మహిళా దినోత్సవం సందర్భంగా 'కనకతార' విజయగాథపై ప్రత్యేక కథనం..

స్వశక్తిలో చేరి.. మార్గదర్శిగా మారి

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన బోయిన కనకతార 2005లో స్వశక్తి సంఘంలో చేరింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన రాజీవ్ యువ శక్తి పథకంలో రూ. 2 లక్షల రుణం తీసుకొని జనరల్ స్టోర్ ఏర్పా టు చేసింది. మహిళలతో స్నేహం 2014లో స్త్రీ శక్తి టైలరింగ్ యూనిట్‌కు పునాదులు పడేలా చేశాయి. బ్యాంకు లింకేజీల ద్వారా రూ. 4.50 లక్షలతో కుట్టు మిషన్లను కొనుగోలు చేసి 14 మందితో టైలరింగ్ ప్రారంభించింది. మరో రూ. 22 లక్షల వ్యయంతో అధునాతన కుట్టు మిషన్లను కొనుగోలు చేసి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్ పిల్లల యూనిఫాం కుట్టి ఇస్తుంది. సొంత షెడ్డు నిర్మించి సంఘంలో 30 మందిని చేర్చుకొని ఒక్కొక్కరికి నెలకు రూ. 10 వేల చొప్పున ఉపాధి కల్పిస్తుంది. మూడు పరిశ్రమల్లో మొత్తం 60 మందికి పని కల్పించి ఆదర్శంగా నిలిచింది. కుట్టు పనికి తోడు పేపర్ ప్లేట్లు తయారు చేసి ఉపాధి పొందవచ్చని అధికారులు సూచించడంతో ఆ దిశగా అడుగులు వేసింది. తన కూతురు బెస్లీతో పేపర్ ప్లేట్ల పరి శ్రమను ఏర్పాటు చేయించి ప్రోత్సహించింది. రూ. 60 లక్షలతో మిషన్లు కొనుగోలు చేసింది. పరిశ్రమ కోసం రూ. 30 లక్షల వ్యయంతో భవనం నిర్మించి మహిళా శక్తిని చాటింది. 2020లో క్లాత్ బ్యాగ్స్ పరిశ్రమను సైతం నెలకొల్పింది. పీఎంఈజీపీ కింద రూ.25 లక్షలు, మరో రూ. 55 లక్షల బ్యాంకు రుణం తీసుకొని షెడ్డు నిర్మాణంతో పాటు మిషన్లను కొనుగోలు చేసి పరిశ్రమను నడుపుతోంది. రూ. 2 కోట్ల అస్తులను సృష్టించి ఏడాదికి రూ. కోటికి పైగా వ్యాపారం చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.



పేపర్ ప్లేట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

మహిళలకు అండ.. మహానంద

- మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టికి నిరంతరం కృషి
- దివ్యాంగురాలైనా.. ధీమాతో ముందుకు

కంగ్టి(నారాయణఖేడ్): మహిళా సంఘాలకు, ఇతర మహిళలకు తనకు తెలిసిన విషయాలపై అవగాహన కల్పిస్తూ అండగా నిలుస్తుంది ఆలురే మహానంద. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని భీంరా గ్రామానికి చెందిన మహానంద పోలియో వ్యాధితో దివ్యాంగురాలు. పౌష్టికాహార వారోత్సవాలున్నా.. బడి బాట ఉన్నా.. ముగ్గుల పోటీలన్నా.. కొనుగోలు కేంద్రాల పరిశీలనలున్నా.. హరితహారమన్నా అన్నింటా ముందుగా కన్పించేది మహానందయే. ఇందిరా క్రాంతి పథంలో కంగ్టి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా విధులు నిర్వహిస్తూ సేవా దృక్పథంతో మహానందం ఉందని చెప్పారు.



గ్రామాల్లో మహిళా సభ్యులతో సమావేశంలో..



పురస్కారాలు, సన్మానాలు అందుకుంటూ..

మహిళా సంఘాలకు..

మహిళా సంఘం మండల అధ్యక్షురాలిగా తాను అన్ని గ్రామాలు తిరిగి సంఘ సభ్యులకు పొదుపు, శ్రీనిధి తదితర పథకాలపై అవగాహన కల్పిస్తుంది. కంగ్టి మండలంలోని 28 గ్రామాల్లో 747 స్వయం సహాయక సంఘాలు, 7,766 మంది సభ్యులున్నారు. ఈ ఏడాది 152 సంఘాలకు రూ.13.28 కోట్లు రుణాలు ఇప్పించారు.

సామాజిక సేవల్లోనూ..

సేవాతత్పరత గల మహిళగా పేరు తెచ్చుకొన్న మహానందకు మరింత ఉత్సాహంగా ముందుకు వెళ్తుంది. గ్రామంలోని మహిళ సభ్యుల్లో ఏమైనా కుటుంబ గొడవలు, భార్యాభర్తల తగాదాలున్నా వారికి నైతిక అవగాహన కల్పిస్తున్నారు. బాల్యవివాహాలు, బాలికల విద్యపై కూడా సమావేశాల్లో ప్రసంగించి చైతన్యం చేస్తుంది. తాను చేస్తున్న కార్యక్రమాలకు పారితోషికం లేకున్నా అధికారులు, స్థానికుల ప్రశంసలే తనకు ఊపిరి అంటున్నారు.

చదువుల తల్లులు.. ఆ అక్కాచెల్లెళ్లు



కూతుళ్లు వర్ష, శ్రేష్టతో తల్లిదండ్రులు రాజు, నాగరాణి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లికి చెందిన ఉడుత రాజు, నాగరాణి దంపతులకు వర్ష, శ్రేష్ట ఇద్దరు కూతుళ్లు. భార్యాభర్తలు పదవ తరగతి వరకు మాత్రమే చదువగా కూతుళ్లను మాత్రం ఉన్నత చదువులు చదివిస్తున్నారు. పెద్ద కూతురు ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో హైదరాబాద్ మహాత్మాగాంధీ ఐటీ కళాశాలలో బీటెక్ ఐటీ పూర్తి చేసింది. ఏడాదిన్నరగా హైదరాబాద్ ఏడీపీ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. రెండో కూతురు శ్రేష్ట బీవీఆర్‌ఐటీ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇద్దరు ఆడపిల్లలకు స్కూటీ నడపడం నేర్పించారు.

ఆడ పిల్లలకు అండగా.. ఆర్థిక భరోసా

- 25 కుటుంబాలకు రూ.5,016 చొప్పున సాయం
- లింగాల లక్ష్మణ్ యువసేన సభ్యులు

బెజ్జంకి(సిద్దిపేట): ఆడపిల్లలకు అండగా ఉంటూ ఆర్థిక చేయూతనందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు బెజ్జంకి మండల కేంద్రంలో లింగాల లక్ష్మణ్ యువసేన సభ్యులు. జూలై 13, 2022లో లింగాల లక్ష్మణ్ యువసేన అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. గ్రామంలో పుట్టిన పేదింటి ఆడ పిల్లలకు రూ.5,016 చొప్పున ఇప్పటి వరకు 25 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మెగా కార్యక్రమాన్ని నిర్వహించి 11 మంది చిన్నారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు అధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. ఇదే కాకుండా ప్రభుత్వాస్పత్రి మహిళా సిబ్బంది, ఆశ కార్యకర్తలకు చీరలను పంపిణీ చేశామన్నారు.



చిన్నారి కుటుంబానికి నగదు అందజేస్తున్న వెంకటేశ్, సభ్యులు

ఫోన్ మెసేజ్‌లతోనే ఎక్కువ ఇబ్బంది

- కాలేజీ, పనిప్రదేశంలో వివక్ష లేదన్న 52 శాతం వనితలు
- ఉందన్నవారు కేవలం 28 శాతం మంది
- ఇంట్లో ఆడ -మగ వివక్ష ఉందన్న వారు స్వల్పమే
- 'సాక్షి' సర్వేలో ఆసక్తికర అంశాలు
- వివిధ ఏజ్‌గ్రూపుల్లో 140 మంది అభిప్రాయాల సేకరణ

బస్టాప్, కాలేజీ, ఆఫీసుల కంటే మొబైల్ మెసేజ్‌లతోనే మహిళల ఇక్కట్లు


సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ నెట్‌వర్క్: మొబైల్ ఫోన్లలో వస్తున్న మెసేజ్‌లతో మహిళలు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. బస్టాప్‌లు, కాలేజీలు, ఆఫీసుల్లో కంటే ఈ మొబైల్‌లలోని సందేశాలతోనే అధికంగా ఇక్కట్లకు గురవుతున్నట్లు తేలింది. బస్టాపులు, ఆఫీసుల్లో ఇబ్బందులు పడుతున్న వారు సుమారు 29 శాతం చొప్పున ఉంటే.. సెల్‌ఫోన్లతో వచ్చే మెసేజ్‌లతో 51 శాతం పరేషాన్ అవుతున్నట్లు మహిళలు అభిప్రాయ పడ్డారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మెదక్ జిల్లాలో 'సాక్షి' ప్రత్యేక సర్వే నిర్వహించింది. 140 మంది మహిళల అభిప్రాయాలను సేకరించి క్రోడీకరించింది. ఇందులో వివిధ ఏజ్‌గ్రూపులకు చెందిన వారి అభిప్రాయలను తీసుకుంది. ఈ సర్వేలో తేలిన ఆసక్తికరమైన అంశాలను పరిశీలిస్తే..


ఇంట్లో వివక్ష లేదు


ఇంట్లో తల్లిదండ్రులు గతంలో ఆడ-మగ వివక్ష చూపేవారు. కాలం మారుతున్న కొద్దీ ఈ వివక్ష తగ్గుతోంది. మగ పిల్లాడితో సమానంగా ఆడ పిల్లలను కూడా చదివిస్తున్నారు. సర్వేలో కూడా ఇదే అంశం తేలింది. 71 శాతం మంది మహిళలు ఇంట్లో వివక్షను ఎదుర్కొనడం లేదని తేల్చి చెప్పారు. కేవలం 12 శాతం మాత్రమే ఇంకా వివక్ష ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. మరో 17 శాతం మంది చెప్పలేమని సమాధానమిచ్చారు.


కళాశాల, పని ప్రదేశాల్లో స్వల్పంగా..

కళాశాలలో, పనిచేసే ప్రదేశాల్లో మహిళలు స్వల్ప వివక్ష ఎదుర్కొంటున్నారు. 28 శాతం మంది మహిళలు ఇప్పటికీ కళాశాల, పని ప్రదేశంలో వివక్ష ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు చోట్ల వివక్ష లేదని 52 శాతం మంది చెప్పారు. 20 శాతం మంది చెప్పలేమని సమాధానమిచ్చారు. మహిళలు ఇబ్బందులకు గురిచేస్తున్న వారిలో తెలియని వారితో పాటు, తెలిసిన వారు కూడా దాదాపు సమానంగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది.









క్లుప్తంగా

భూసేకరణ పూర్తి చేయాలి

కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రాంతంలోని గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ కాల్వలు, రంగనాయకసాగర్ నుంచి కోహెడ మండలంలోకి వచ్చే కెనాల్ కాల్వల భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయలంలో భూసేకరణపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గం గుండా జాతీయ రహదారి వెళ్తోందని, రోడ్డు పనులు ఆగిన చోట భూసేకరణ సమస్య పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం భూములను గుర్తించాలని అదేశించారు. సమావేశంలో ఆర్డీఓ రాంమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఎఫ్‌పీఓ రోల్ మోడల్‌గా నిలవాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రసిద్ధ ఎఫ్‌పీఓ అందరికీ ఒక రోల్ మోడల్‌గా నిలవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రసిద్ధ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవో, డైరెక్టర్లు,అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా ఏం పంటలు పండిస్తున్నారనే విషయాలను తెలుసుకొని రాష్ట్రంలో వివిధ మార్కెట్‌లో ధరలను గురించి అక్కడ ఉన్న వాతావరణ పరిస్థితులకు గుర్తించి మనం ఎలాంటి పంటలను ఎగుమతి చేయాలనే విషయ పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నారు. అలాగే మండలంలోని అంతకపేట జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో నిర్మాణ్ సంస్థ సౌజన్యంతో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న కంప్యూటర్ ల్యాబ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పదోవ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో బానోతు జయరామ్, వ్యవసాయ అధికారి సుల్తానా, ఎంఈవో గుగులోతు రంగనాయక్ పాల్గొన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

డీఐఈఓ రవీందర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా, మానసిక ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో కొనసాగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. అనంతరం దుబ్బాక మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల వేళ తమ విలువైన సమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. జేఈఈ మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన మైనార్టీ కళాశాలకు చెందిన భాను ప్రసాద్, సుభాష్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యుడు దేవయ్య, కస్టోడియన్ శివకుమార్, మైనారిటీ కళాశాల ఉపాధ్యాయులు, వార్డెన్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సాధికారతలేనిదే అభివృద్ధి లేదు: రంగనాథ్

కొమురవెల్లి(సిద్దిపేట): మహిళల స్థితి గతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదని జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి రంగనాథ్ అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో రమేశ్‌తో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సమాజ నిర్మాణంలో సగభాగమైన మహిళ సమానత్వమే మన ప్రగతికి మూలాధారమన్నారు. అనంతరం పాఠశాలోని మహిళ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, మధ్యాహ్న భోజన కార్మికులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లావణ్య, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు కరుణశ్రీ,, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణి.. మహిళా కేంద్రం

దెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘం రేడియో స్టేషన్‌లో కార్యక్రమాలన్నింటినీ మహిళలే నిర్వహిస్తున్నారు. అల్గోల్ నర్సమ్మ, జనరల్ నర్సమ్మ ప్రతి నిత్యం కార్యక్రమాలను రూపొందించుకొని ప్రసారం చేస్తున్నారు. జహీరాబాద్

- మహిళల సంఘం రేడియో స్టేషన్
- ప్రతీ నిత్యం రెండు గంటలపాటు కార్యక్రమాలు
- స్థానిక అంశాలే ప్రసారం



పాటలను రికార్డింగ్ చేస్తున్న అల్గోల్ నర్సమ్మ

గ్రామాలకు వెళ్లి సమాచారం సేకరణ

ఝురాసంగం మండలంలోని మాచ్‌నూర్ గ్రామంలో 1998 సంవత్సరంలో సంఘం రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్ నుంచి సుమారు 20 కిలోమీటర్ల మేర ప్రసారాలు అందుతున్నాయి. 90.4 ఫ్రీక్వెన్సీలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు కార్యక్రమాలను అందిస్తున్నారు. మండలంలోని అల్గోల్ గ్రామానికి చెందిన అల్గోల్ నర్సమ్మ, పస్తాపూర్ గ్రామానికి చెందిన జనరల్ నర్సమ్మ 1999 నుంచి రేడియో స్టేషన్ నిర్వహిస్తున్నారు. గ్రామాలకు వెళ్లి ప్రసారాలకు కావాల్సిన సమాచారాన్ని ఆడియో రికార్డింగ్ చేసుకుంటారు. డీడీఎస్‌కు సంబంధించి పలు కార్యక్రమాలను చూస్తున్న ఏడుగురు మహిళలు రేడియో ప్రసారాలకు సంబంధించిన కార్యక్రమాలను గ్రామాలకు వెళ్లినప్పుడు ఆడియో రికార్డింగ్ చేసుకొని స్టేషన్ నిర్వాహకులకు అందిస్తున్నారు. వాటిని ఎడిట్ చేసుకొని ప్రసారం చేస్తారు.

ముఖ్యమైన ప్రసారాలు

మన ఊరి పంటలు, ఆరోగ్యం, సంఘాలు, చావిడి కట్ట, భాష, మన రుచులు, పండుగలు, పాటలు, పర్యావరణం, బాలానందం, యారండ్ల ముచ్చట్లు తదితర కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేస్తున్నారు. భాషకు సంబంధించి తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ భాషల్లో పెద్ద మనుషులతో వినిపిస్తారు. పొలంలో పనిచేసే సమయంలో, పెళ్లి సందర్భంలో, పుట్టినరోజు వేడుకలు, యువతులు పుష్పవతి అయిన సమయంలో పాడే పాటలను పరిచయం చేస్తారు. చిన్న పిల్లలకు సంబంధించి బాలానందం కార్యక్రమం నిర్వహించి పాటలు, కథలు వినిపిస్తారు. సీజన్ వ్యాధులు, చిన్న పిల్లల సంరక్షణ తదితర అంశాలపై ముచ్చటిస్తారు. వ్యవసాయ విషయానికి వస్తే పంట వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలు, ఏయే పంటలు వేయాలి, ఎరువులు, పశువుల పెంపకం, కోళ్ల పెంపకం గురించి సూచనలు చేస్తారు.



సాగుపై రికార్డింగ్ చేస్తున్న నర్సమ్మ



రేడియో స్టేషన్ నిర్వహిస్తున్న జనరల్ నర్సమ్మ

వారే మిక్సింగ్, కంపోజింగ్..

అల్గోల్ నర్సమ్మ, జనరల్ నర్సమ్మ రేడియో స్టేషన్‌లో మిక్సింగ్, కంపోజింగ్, ట్రాన్స్‌మిషన్ నిర్వహణ, రికార్డు చేసిన కార్యక్రమాల ఎడిటింగ్ పనులను చూస్తారు. ప్రతీ నిత్యం కార్యక్రమాలను రూపొందించుకొని ప్రసారం చేసేంత వరకు వారే చూసుకుంటారు. ఇద్దరూ డీడీఎస్ డైరెక్టర్ దివంగత పీవీ సతీష్ వద్ద శిక్షణ పొందారు. అప్పటి నుంచి వారు ఈ కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను నిర్వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

ఆడబిడ్డ పుడితే రూ.2,116

పెద్దశంకరంపేట(మెదక్): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పుట్టిన ప్రతీ ఆడపిల్లకు మండల పరిధిలోని కమలాపూర్ మాజీ సర్పంచ్ కుంట్ల రాములు రూ.2,116 అందజేస్తున్నారు. ప్రతీ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమ గ్రామంలో పుట్టిన ఆడపిల్లలకు నగదును అందజేయడం సంతోషంగా ఉందని, ఆడపిల్లలను గౌరవించాలని, ఉన్నత చదువులు చదివి ఆర్థికంగా ఎదగాలని ఈ సందర్భంగా కుంట్ల రాములు కోరారు.



నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ కుంట్ల రాములు (ఫైల్)



ఆడకూతురు పెళ్లికి పుస్తె మెట్టెలు అందిస్తున్న రఘువీరారెడ్డి మిత్రులు

పేదల పాలిట పెళ్లి పెద్ద

నర్సాపూర్: పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తన వంతుగా సహాయం చేస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి. తన మిత్రుడు హకీం ఇచ్చిన సూచన మేరకు నియోజకవర్గంలో జరిగే ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తె మెట్టెలు అందజేయాలని నిర్ణయించారు. సుమారు 12 ఏళ్ల క్రితం అమలులో పెట్టారు. అయితే వాటిని అందజేసే సమయంలో ప్రచారం కోసం ఆరాటపడటం లేదు. ఇప్పటివరకు సుమారు 2,500 మంది ఆడపిల్లలకు రఘువీరారెడ్డి పుస్తె మెట్టెలు అందజేశారు. శక్తి ఉన్నంత వరకు పేద కుటుంబాలకు అండగా నిలుస్తానని అన్నారు. గతంలో ఒక ఆడ కూతురుకు పుస్తె మెట్టెలు ఇవ్వడానికి రూ. 8 వేల వరకు ఖర్చు కాగా, ప్రస్తుతం రూ. పది వేలు అవుతున్నాయని చెప్పారు. కులమతాలకు అతీతంగా పేద వారికి సహాయం చేయడమే తన లక్ష్యమని రఘువీరారెడ్డి పేర్కొన్నారు.

'ఆద్య'ంతం.. సంతోషం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మగ పిల్లవాడు లేడనే లోటు మాకు లేదు. ఆడ పిల్లనే ఇంటికి ముద్దు అని తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీకు చెందిన నాయని సుధాకర్, స్వాతి దంపతులు తెలిపారు. ఏకైక కుమార్తె ఆద్యను ఎంతో అల్లారు ముద్దుగా చూసుకుంటాం. ప్రస్తుతం ఆద్య 8వ తరగతి చదువుకుంటుంది. ఆడపిల్లతోనే మేము చాలా సంతోషంగా ఉన్నాం.



ఆద్యతో తల్లిదండ్రులు



కూరగాయలు విక్రయిస్తున్న నిర్మల

చిన్న వయసులో.. 'నిర్మల'మైన మనసు

- కష్టాలు ఓరుస్తూ.. కుటుంబ భారం మోస్తూ
- కూరగాయలు అమ్ముతున్న విద్యార్థిని

నారాయణఖేడ్: ఆ కుటుంబానికి కష్టాలు చుట్టుముట్టాయి.. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు.. ఇంటినిండా ఆడపిల్లలు.. పెద్దల నుంచి వచ్చిన అర ఎకరం పొలం.. తండాలో చిన్నపాటి ఇల్లు.. ఆ దంపతులు పడరాన్ని పాట్లు పడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తూ పిల్లలను పెంచి పెద్ద చేశారు. ముగ్గురు ఆడపిల్లలను పెళ్లిళ్లు చేసి పంపేసరికి రూ.12 లక్షల అప్పు. ఆ కుటుంబం మరింత కష్టాల్లోకి నెట్టి వేయబడింది. ఈ కష్టాలను చూసిన నాలుగో కూతురు ఓ రాణి రుద్రమలా ధైర్యాన్నిస్తూ తల్లిదండ్రుల వెన్ను తట్టింది..

నారాయణఖేడ్ మండలం చందర్‌నాయక్ తండాకు చెందిన చందర్, చాందీబాయికి ఆరుగురు సంతానంలో ఐదుగురు కూతుళ్లే. లత, బూలి, బుజ్జి, నిర్మల, వైశాలి తర్వాత పవన్ పుట్టాడు. లత, బూలి, బుజ్జిబాయిల వివాహమైంది. రూ.12 లక్షల వరకు అప్పులు అయ్యాయి. అర ఎకరం పొలంలో కూరగాయలు పండిస్తూ ఖేడ్ పట్టణంలో విక్రయిస్తున్నారు. నాలుగో కూతురు నిర్మల సిద్దిపేటలో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతిలో 9.8 జీపీఏ ఉత్తీర్ణత సాధించింది. ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినా తండ్రి అనారోగ్యానికి గురవ్వడం కుటుంబ భారం వల్ల వెళ్లలేదు. ఖేడ్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్ అయ్యింది. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో ఓ కానిస్టేబుల్ కొనిచ్చిన నీట్ ప్రిపరేషన్‌కు సంబంధించిన పుస్తకాలను పఠనం చేస్తుంది. తమ అర ఎకరం పొలంలో నిత్యం పండిన కూరగాయలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. తెల్లవారు 3 గంటలకు వచ్చిన నిర్మల బీట్‌లో కూరగాయలు కొని దుకాణంలో సర్ది 8 గంటల వరకు వ్యాపారం.. అనంతరం తండాకు వెళ్లి 9 గంటలకు కళాశాలకు వెళ్తుంది. ఇలా కష్టపడుతున్న నిర్మల ఆ కుటుంబానికి ధైర్యం ఇస్తూ తన లక్ష్యం డాక్టర్ కావాలని.. మరో సోదరి, సోదరుణ్ణి జీవితంలో వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలని చెబుతుంది. చదువులో నిర్మల మంచి ప్రతిభ కనబరుస్తుందని ఉపాధ్యాయులూ చెబుతున్నారు.

మహిళలు మానవాళికి దిక్సూచి

జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

సిద్దిపేట ఎడ్యుకేషన్: మహిళలు మానవాళికి దిక్సూచి అని, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు అన్ని రకాలుగా స్వేచ్ఛగా ఉండాలన్నారు. ఎన్‌సీసీ ద్వారా ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం గరిమా అగర్వాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ఎన్‌సీసీ కేర్ టేకర్ కృష్ణయ్య, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ మామిడ్యాల శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

హుస్నాబాద్‌రూరల్: పట్టణ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో సుందరీకరణ పనులకు సంబంధించి శుక్రవారం అధికారుల చేత కొలతలు చేయించారు. అభివృద్ధి పనులు ఎక్కడా అసంపూర్తిగా లేకుండా కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం పాఠశాలను తనిఖీ చేశారు. హాస్టల్‌లోని సరుకులను పరిశీలించారు. నాణ్యత లేని వంట సరుకులను ఎట్టి పరిస్థితిలో కొనుగోలు చేయరాదన్నారు. ఇంటర్ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి పై ఈఓ కిషన్‌రావును అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ మనీల ఉన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 29వ తేదీ నుండి బీహార్ రాష్ట్రంలో జరగబోయే 39వ జూనియర్ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండల పరిధిలోని నాగపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి తమ్ము బాలు ఎంపికై నట్లు హెచ్‌ఎం ఐలయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న బాలు జాతీయస్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. 29 నుంచి జరిగే పోటీల్లో బాలు పాల్గొంటాడన్నారు. ఎంపికై న బాలును ఉపాధ్యాయ బృందం అభినందించారు.



బాలుతో హెచ్‌ఎం ఐలయ్య

ముందు మీ తప్పులను సరిదిద్దుకోండి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



అవగాహన కల్పిస్తున్న రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: బీఆర్ఎస్‌కు ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చారని, ఇప్పటికైనా ఆ పార్టీ నాయకులు బీజేపీని విమర్శించే ముందు తమ తప్పులను సరిచేసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల త్రిశక్తి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జన ఔషధి దివాస్ సందర్భంగా గజ్వేల్‌లోని జనరిక్ మెడికల్ దుకాణంను సందర్శించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందని ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, కేసీఆర్‌కు చెప్పి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీసీకి కేటాయించేలా చూడాలని కవితకు సూచించారు. గతంలో ఈటెల రాజేందర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఒకటి ఓసీలకు, మరొకటి బీసీలకు కేటాయించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, నాయకులు ఎల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, జశ్వంత్‌రెడ్డి, వెంకటరమణ, రాంరెడ్డి, కుడిక్యాల రాములు, శివకుమార్, శశిధర్‌రెడ్డి, సురేష్, మహేష్, మనోహర్ యాదవ్, అశోక్‌గౌడ్, జన ఔషధి దుకాణం నిర్వాహకులు రమణాచారి, వినోద్‌తోపాటు ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.69.11లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామికి రూ.69.11లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ సిబ్బంది వెల్లడించారు. స్వామి వారి ఆలయంలో 15రోజుల హుండీ ఆదాయాన్ని మెదక్ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు శుక్రవారం లెక్కించారు. నగదు రూ 69,11,633, విదేశి కరెన్సీ నోట్లు 14, మిశ్రమ బంగారం 46 గ్రాములు, మిశ్రమ వెండి 5కిలోల 200 గ్రాములు, పసుపు బియ్యం15 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం నగదును స్థానిక తెలంగాణ గ్రామీణావికాస్ బ్యాంక్‌లో జమ చేశారు.

రాజీపడేట్లు చూడాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ మొత్తంలో కేసులు రాజీ అయ్యేట్లు చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటారు రోడ్డు ప్రమాద కేసుల్లో రాజీ కుదిర్చి అధిక మొత్తంలో కేసులు రాజీ అయ్యేట్లు చూడాలన్నారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళా న్యాయవాదులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్‌కాంబ్లి, శ్రావణి, తరణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

ములుగు(గజ్వేల్): విద్యార్థులు వినూత్న ఆలోచనలను అన్వేషించాలని ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్)డిప్యూటీ డైరెక్టర్ జనరల్(విద్య) డాక్టర్.ఆర్.సి అగర్వాల్ సూచించారు. ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం సెంట్రల్ ల్యాబ్, స్మార్ట్ క్లాస్ గదిని వైస్ చాన్స్‌లర్ డాక్టర్.డి.రాజిరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంతో పాటు వ్యవసాయ పురోగతికి చురుకుగా దోహదపడాలన్నారు. విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ ల్యాబ్, స్మార్ట్ క్లాస్ గదులు అభ్యాస అనుభవాన్ని మెరుగుపరుస్తాయని, పరిశోధన, విద్యానైపుణ్యం కోసం విద్యార్థులకు అత్యాధునిక వనరులను అందిస్తాయని తెలిపారు. విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ, శ్రీనివాసన్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

దుబ్బాకటౌన్: మేలైన యాజమాన్య పద్ధతులతో పొద్దు తిరుగుడు సాగులో అధిక దిగుబడులు పొందవచ్చని తోర్నాల వ్యవసాయ పరిశోధన క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలం మంతూర్‌లో పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పొద్దుతిరుగుడు పంటను పరిశీలించారు. కార్యక్రమానికి భారతీయ నూనె గింజల పరిశోధన ప్రధాన శాస్త్రవేత శ్రీనివాస్, రాజేంద్రనగర్, కోయంబత్తూర్ శాస్త్రవేత్తలు శశికళ, సెంథిల్, రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్, వ్యవసాయ విస్తరణ అధికారి కవిత, మంతూర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

ములుగు అటవీకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనిధి

ములుగు(గజ్వేల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.ఎస్ శ్రీనిధి సూచించారు. ములుగు మండలం అచ్చాయిపల్లిలో వారంరోజుల పాటు కొనసాగనున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ నియంత్రణ, స్వచ్ఛభారత్, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం లయన్స్‌క్లబ్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసి గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడంలో ప్రతి ఒక్కరూ పాత్రధారులు కావాలన్నారు. ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలు శుభ్రం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలోనే తొలి స్క్రాపింగ్ కేంద్రం

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి కొండల్‌రావు

వర్గల్(గజ్వేల్): కాలుష్య నియంత్రణలో భాగంగా కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ చేసేందుకు రాష్ట్రంలోనే తొలి కేంద్రం ఏర్పాటైంది. వర్గల్ మండలం చందాపూర్‌లో పాతవాహనాలను రీసైక్లింగ్ చేసేందుకు అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాహన స్క్రాపింగ్‌కేంద్రాన్ని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి కొండల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణలోనే ఇది తొలి స్క్రాపింగ్ కేంద్రమన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరు పదిహేనేళ్లు ముగిసిన కాలం చెల్లిన వాహనాలను స్క్రాపింగ్ కేంద్రాలలో అప్పగించి సహకరించాలని సూచించారు. కాలుష్యకారక, కాలం చెల్లిన వాహనాల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పాలసీతో స్క్రాపింగ్ విధానాన్ని అమలుచేస్తున్నాయని తెలిపారు. కాలం చెల్లిన వాహనాల వాహనాల స్క్రాపింగ్ కోసం వాటి యజమానులకు ప్రభుత్వం వివిధ రకాల రాయితీలతో ప్రోత్సహిస్తుందని వివరించారు.



స్క్రాపింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న కొండల్‌రావు